సాక్షి
నంద్యాల
మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు సోమవారం అధికారులు తెలిపారు. డ్యాంలో 1.068 టీఎంసీల నీరు ఉంది.



రాజగోపురానికి రూ.లక్ష విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ రాజగోపుర నిర్మాణానికి పత్తికొండకు చెందిన ఇల్లూరి నాగరాజ కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళమిచ్చారు.



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వెండిరథంపై ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైభవంగా ధనుర్మాస పూజలు



ప్రత్యేకాలంకరణలో కొలువైన గోదాదేవి అమ్మవారు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామితోపాటు శ్రీ గోదాదేవి అమ్మవారిని యాగశాలలో కొలువుంచి వేదపండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ కనులపండువగా నవకళశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం, అర్చన నిర్వహించి ఉత్సవ మూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తి గోదాదేవి అమ్మవారిని మూలవిరాట్ గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కొలువుంచారు. సాయంత్రం ఉత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సమస్యలపై స్పందించండి

● ఎస్‌ఈ ఎం.ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయ సమస్యలపై స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. సోమవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ కారణాలతో బ్రేక్ డౌన్, ఫీడర్ డౌన్, ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ఎగ్జిఫ్యూజ్, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ కాలిపోవడం వంటి కారణాలతో అంతరాయం ఏర్పడుతూ ఉంటుందని, ఈ సమస్యల వల్ల కరెంట్ పోయిందని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.



కబడ్డీ ట్రయల్ మ్యాచ్‌లో తలపడిన క్రీడాకారులు

● 40 రోజుల క్రీడా సంబరం
● నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు
● లక్ష్యాన్ని అధిగమించిన క్రీడాకారుల రిజిస్ట్రేషన్లు
● ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం

చదువుల విప్లవం పేరుతో విద్యారంగానికి పెద్దపీట చేసిన రాష్ట్ర ప్రభుత్వం అదే క్రమంలో ప్రతిభా క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా అడుగులు వేసింది. క్రీడా ఆణిముత్యాలను వెలికితీసి ప్రపంచానికి పరిచయం చేసేలా పకడ్బందీ కార్యాచరణ రూపొందించి 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రీడా పోటీల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఈ పోటీలకు జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాన్ని మించి ఆటగాళ్లు పేర్లు నమోదు చేసుకోవడం విశేషం. క్రీడాకారుల రిజిస్ట్రేషన్లు, పరికరాల పంపిణీ, మైదానాలు సిద్ధం, పోటీల నిర్వహణ ఏర్పాట్లు అన్నీ చకచకా పూర్తయి మంగళవారం నుంచి క్రీడా సంబరాలు షురూ కానున్నాయి.



ప్రతిభ మెరిసేలా.. పతకాలు మురిసేలా!



గోస్పాడు/ఆత్మకూరు: ప్రతిభ ఉండి సరైన ప్రోత్సాహం లేక ఎంతో మంది క్రీడల్లో ముందడుగు వేయలేకపోతున్నారు. వారిని ప్రోత్సహించి వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలనే ఉద్దేశంతో 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది. ఈ మేరకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోటీలపై ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడగానే క్రీడాకారులు రెట్టింపు ఉత్సాహంతో పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ పోటీలు ఈ నెల 26వ తేదీన ప్రారంభమై జనవరి 1 వరకు గ్రామ స్థాయిలో, జనవరి 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మండల స్థాయి, 16 నుంచి 21వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, 22 నుంచి 28వ తేదీ వరకు జిల్లా స్థాయిలో, 29 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలను నిర్వహించనున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు పురుషులు, మహిళలు పోటాపోటీగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లాలోని 516 సచివాలయాల పరిధిలో 1,17,648 మంది లక్ష్యం కాగా 1,25,538 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నారు. వారిలో పురుషులు 91,423 కాగా మహిళలు 34,115 మంది ఉన్నారు. క్రీడల నిర్వహణ కోసం జిల్లాలో 390 క్రీడా మైదానాలు సిద్ధం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. క్రీడా పోటీలకు సంబంధించి జిల్లా కేంద్రంలో ముందుగా ట్రయల్ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. పోటీలకు సంబంధించిన క్రీడా పరికరాలు ఇప్పటికే ఆయా క్రీడా కేంద్రాలకు జిల్లా అధికారులు పంపిణీ చేశారు. అలాగే పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులను జట్లుగా విడదీసి పోటీలకు సిద్ధం చేశారు.

నిర్వహణ ఇలా..

➡ జిల్లా వ్యాప్తంగా 516 సచివాలయాల పరిధిలో స్త్రీ, పురుషులను విభజించి పోటీలను నిర్వహించనున్నారు.

➡ వాలీబాల్ జట్టులో 12, ఖోఖో జట్టులో 15, క్రికెట్ జట్టులో 16, బ్యాడ్మింటన్‌లో ఇద్దరు చొప్పున క్రీడాకారులు ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది.

➡ గ్రామ స్థాయిలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. నిబంధనల మేరకు 15 ఏళ్ల పైబడిన వారు ఎవరైనా పాల్గొనవచ్చు.

➡ పోటీల నిర్వహణకు ప్రత్యేకంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జిల్లా స్థాయి కమిటీల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తారు.

జిల్లాలో క్రీడా జట్ల వివరాలు

క్రీడ	పురుష జట్లు	మహిళా జట్లు
క్రికెట్	2,497	172
బ్యాండ్మింటన్	2,390	2,089
వాలీబాల్	993	248
కబడ్డీ	1,611	352
ఖోఖో	462	611

క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు..

ఆడుదాం – ఆంధ్ర క్రీడా పోటీల్లో విజేతలకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు, ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేయనుంది.

- క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు నియోజకవర్గ స్థాయిలో 35 వేలు, రూ. 15 వేలు, రూ. 5 వేలు, జిల్లా స్థాయిలో రూ.60 వేలు, రూ. 30 వేలు, రూ. 10 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ. 5 లక్షలు, రూ.3 లక్షలు, రూ. 2లక్షలు ఉంటుంది.
- బ్యాడ్మింటన్ క్రీడాంశంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు నియోజకవర్గ స్థాయిలో రూ. 20 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు, జిల్లా స్థాయిలో రూ. 35 వేలు, రూ. 20 వేలు, రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ. 2 లక్షలు, రూ. 1 లక్ష, రూ.50 వేలు అందజేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ఏర్పాట్లు పూర్తి



ఆడుదాం ఆంధ్రా పోటీలకు మండలంలోని సచివాలయాల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నాం. సచివాలయ, మండల స్థాయిలో పోటీలను నిర్వహించనున్నాం. పోటీలకు అవసరమైన వసతులు సమకూర్చాం. మైదానాలు కూడా చదును చేసి క్రీడలకు అనువుగా ఉండేలా చేయించాం. ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఎంతో ఆదరణ ఉంది.

– అనసూయ, ఇన్‌చార్జి ఎంపీడీఓ, గోస్పాడు

క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు



యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. క్రీడా సామగ్రిని సచివాలయాలకు చేరవేశాం. మైదానాలను అనువుగా తీర్చిదిద్దాం. పేర్లు నమోదు చేసుకున్న వారు పోటీల్లో పాల్గొనేలా అవగాహన కల్పిస్తున్నాం.

– ఎంఎస్‌వీ రాజు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, నంద్యాల

ప్రోత్సాహం అభినందనీయం



రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయం. ఈ కార్యక్రమం క్రీడారంగాభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది.

–రఫిక్, సీనియర్ క్రీడాకారులు, ఆత్మకూరు

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సర్వం సిద్ధం

నంద్యాల(సిటీ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంగళవారం నుంచి ప్రారంభించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సర్వం సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఆయన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డిల ఆధ్వర్యంలో పట్టణంలోని పలు క్రీడా మైదానాలలో ఏర్పాట్లను పరిశీలించారు. కేఎస్ఆర్ మున్సిపల్ పాఠశాల మైదానం, ఎస్పీజీ గ్రౌండ్స్, పాలిటెక్నిక్ కళాశాల, వైఎస్సార్ నగర్, రామకృష్ణ పీజీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్‌జీఓస్ కాలనీ మున్సిపల్ పాఠశాల తదితర ప్రాంతాల్లో క్రీడామైదానాలను శుభ్రం చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ నంద్యాల వార్డు సచివాలయాల పరిధిలో నమోదు చేసుకున్న ప్రతి క్రీడాకారుని నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మారుతున్న జీవన విధానంలో క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఒత్తిడిని అధిగమించేందుకు దోహదం చేస్తాయన్నారు. సాయంత్రం ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి రాజు తదితరులు క్రీడా మైదానాలను ఏర్పాట్లను పరిశీలించారు.



నంద్యాలలో పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు, కమిషనర్ రవిచంద్రారెడ్డి



నంద్యాల సాయిబాబ నగర్‌లోని ఏసుకృప మినిస్ట్రీస్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పరిశుద్ధుడు జన్మించగా.. లోకమంతా పరవశించగా!

ఆకాశంలో తార వెలుగొందగా.. దివి నుంచి భువికి బాల ఏసు ఏతెంచగా.. భూలోకాన సంబరాలు మిన్నంటగా.. దూతలు గేయాలు ఆలపించగా.. క్రైస్తవుల్లో సంతోషం వెల్లివిరిసింది. సోమవారం నంద్యాల జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఏసు రాకను స్వాగతిస్తూ ఉదయాన్నే చర్చిలకు చేరుకుని ప్రార్థనలు చేశారు. మానవాళి మధ్య శాంతి, కరుణ, సహోదర ప్రేమను నెలకొల్పేందుకే క్రీస్తు భూలోకానికి వచ్చారని, ఏసు జననం మానవాళికి రక్షణ కవచమని చర్చిల పాస్టర్లు, ఫాదర్లు ఏసు సందేశాన్ని వినిపించారు. క్రిస్మస్ సందర్భంగా కేక్ కటింగ్‌లు, ఆటల పోటీలతో క్రైస్తవులు సందడి చేశారు.

– నంద్యాల(న్యూటౌన్)

– ఫొటోలు 8లో..



నంద్యాల హోలీక్రాస్ కెథడ్రల్ చర్చిలో దైవ సందేశం ఇస్తున్న బిషప్ ఐజక్ వరప్రసాద్

- మరిన్ని ఫొటోలు 8లో▶

శిల్ప చిత్రం.. మరింత భద్రం

● శ్రీశైల ఆలయ శిల్పప్రాకారంపై అరుదైన శిల్ప సంపద
● శిల్పాల విశేషాలను భద్రపరిచేలా చర్యలు
● ప్రాకార శిల్ప వైభవాన్ని ఫొటోగ్రఫీ, వీడియో డాక్యుమెంటరీ
● ఛాయా చిత్రాలతో గ్రంథం ముద్రణ



శ్రీశైల ఆలయ ప్రాకార కుడ్యంపై ఆకట్టుకుంటున్న శిల్ప కళ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఆలయ ప్రాకార కుడ్యం ఎంతో విశిష్టమైన కట్టడం. శ్రీశైలంలోని ఆలయ ప్రాంగణం భారతీయ శిల్పాలతో పోల్చితే ఒక ప్రత్యేకతను కలిగిఉంది. ఇంతటి అరుదైన ప్రాకార శిల్పాల విశేషాలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు దేవస్థానం చర్యలు చేపట్టింది. ఇందుకోసం శిల్పా ప్రాకార విశేషాలతో ఫొటోగ్రఫీ, వీడియో డాక్యుమెంటరీ చేస్తున్నారు. అలాగే శిల్పాల ఛాయాచిత్రాలతో గ్రంథాన్ని ముద్రించనున్నారు. శ్రీశైల ఆలయ శిల్పప్రాకారం, ఆలయం చుట్టు కోట గోడ ప్రాకారంపై ఉన్న పలు శిల్పాలను ఫొటోగ్రఫీ డిజిటలైజేషన్ పనులు కొన్ని రోజుల క్రితం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ మొదటి దశగా ఫొటోగ్రఫీ నిపుణులతో ఆయా ప్రాకార శిల్పాల ఛాయాచిత్రాలను తీయించి దేవస్థానానికి ఉచితంగా అందజేస్తోంది. అలాగే ఆలయ శిల్ప ప్రాకార విశేషాలను శాశ్వత ప్రాతిపదికన భద్రపరిచేందుకు వీలుగా డిజిటలైజేషన్ చేయించాలని, ఇందులో భాగంగా ప్రాకార శిల్పాలను అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ చేయిస్తున్నారు. అంతేకాకుండా ప్రాకార శిల్పాల ఆయా ఛాయా చిత్రాలు, వాటి విశేషాలతో కూడిన గ్రంథాన్ని ప్రచురించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీడియో డాక్యుమెంటరీని రూపొందించాలని మంత్రి ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు దేవదాయశాఖ ధర్మ ప్రచార పరిషత్ డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి మార్గదర్శకత్వంలో ఆయా పనులను ప్రారంభించారు.

శిల్పం.. వైవిధ్యభరితం

శ్రీశైల ప్రాకారంలోని శిల్పాలు ఎన్నో విశేషాలతో వైవిధ్యభరితంగా ఉన్నాయి. దేవతలకు, పురాణ కథలకు, మతాచారాలకు సంబంధించిన శిల్పాలను మత శిల్పాలని, ఆడవులు, జంతువులు, పక్షులు మొదలైన వాటిని ప్రకృతి, మానవ జీవితములో వివిధ అంశములైన వేట, తిరునాళ్లు, దండయాత్ర మొదలైన వాటిని సామాజిక, తోరణాలు, అలంకారిక చిహ్నాలు, చుతురస్ర, దీర్ఘచతురస్ర నమూనాలు మొదలైన వాటిని అలంకారిక శిల్పాలని చరిత్రకారులు విభజించారు. మత శిల్పాల ప్రకారంగా శ్రీశైల ఆదిదేవుడైన శ్రీ మల్లికార్జునస్వామి అవిర్భావాన్ని గురించి, శివుని తత్వత్వాన్ని, శివుని గొప్పతనాన్ని, అమ్మవారి గొప్పతనాన్ని, శైవ, స్త్రీ మత ప్రాభావాన్ని తెలియజేస్తున్నాయి. ప్రకృతి శిల్పాలలో ప్రాకారానికి నాలుగు వైపులా కింద భాగంలో రెండు వరుసలలో ఉన్న ఎనుగులు, గుర్రాల శిల్పాలు ముఖ్యమైనవి. ప్రాకారకుడ్యంలో సామాజిక శిల్పాలు ఆనాడు సమాజంలోని ఆధ్యాత్మిక, వ్యక్తిత్వం, దేహభావాలు, విలాసాలు, యుద్ధరీతులు, వేట దృశ్యాలు, దేవుని ఊరేగింపులు, సంగీతంతో కూడిన నృత్యాలు, జానపద నృత్యరీతులు మొదలైన వాటిని సూచిస్తున్నాయి. ఇతిహాస, పౌరాణిక వృత్తాంతాలు, జానపద జీవన చిత్రీకరణ శిల్పాలు అలంకారిక శిల్పాలను గమనించవచ్చు.

భక్తులు తెలుసుకునేలా

శ్రీశైలానికి విచ్చేసిన భక్తులు ఆలయ ప్రాకారకుడ్యాన్ని సందర్శించి పరవశించిపోతారు. శ్రీశైల ప్రాకార కుడ్యాన్ని అత్యంత పవిత్రంగా భావించి పర్యవేక్షణ చేపడుతున్నాం. శిల్పా ప్రాకారాలపై ఫొటోగ్రఫీ, వీడియో డాక్యుమెంటరీతో పాటు, గ్రంథాన్ని కూడా ముద్రిస్తాం. ప్రాకారకుడ్యం విశిష్టతను భక్తులందరికీ తెలియజేసేలా తగు చర్యలు తీసుకుంటాం.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

చురుగ్గా కేబీ రోడ్డు పనులు



కర్నూలు(అర్బన్): కర్నూలు – బళ్లారి రోడ్డు (కేబీ రోడ్)లో కి.మీ 4/0 నుంచి 8/4 కి.మీ వరకు రోడ్డు వెడల్పు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. తుంగభద్ర పుష్కరాల నిధులు రూ.13.20 కోట్లతో ఈ పనులను చేపడుతున్నారు. కర్నూలు నగరం బళ్లారి చౌరస్తా నుంచి కల్లూరు మండలం పెద్దపాడు వరకు రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతుండటంతో ప్రస్తుతం ఉన్న రోడ్డును వెడల్పు చేసి, మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఆర్ నాగరాజు తెలిపారు. పనులు కాగా రోడ్డు వెంట ఉన్న కల్వర్టులను పూర్తి స్థాయి నాణ్యతతో వెడల్పు చేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు శ్రీశైల మల్లన్నకు వార్షిక ఆరుద్రోత్సవం



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లికార్జునస్వామి వారికి వార్షిక ఆరుద్రోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ప్రతి నెలలో ఆరుద్రోత్సవాన్ని మాసోత్సవంగా నిర్వహిస్తుండగా ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున మాత్రం వార్షిక ఆరుద్రోత్సవంగా జరిపించబడుతుంది. ఈ మేరకు మంగళవారం రాత్రి 10 గంటల నుంచి మల్లికార్జున స్వామి వారికి మహాన్యాసపూర్వక లింగోద్భావకాల రుద్రాభిషేకం,అన్నాభిషేకం, బుధవారం తెల్లవారుజామున స్వామివార్ల ప్రాతఃకాల పూజల అనంతరం నందివాహన సేవ, గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. బుధవారం వేకువజామున స్వామివారి ఉత్సవ మూర్తులను స్వామివారి ఆలయ ముఖమండపంలో ఉత్తరముఖంగా ఉంచి అర్చకులు ప్రత్యేకపూజలు చేపడుతారు. అనంతరం ముఖమండపం ఉత్తర ద్వారాలను తెరిచి భక్తులకు ఉత్సవమూర్తుల ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు. ఉత్సవాల్లోనే భాగంగానే ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖ మండపం ఉత్తర ద్వారం నుంచి వెలుపలకు తోడ్కొని వచ్చి ఆలయ ఉత్తర భాగంలోనే నందివాహనంపై ఉంచి ఆలయ ప్రధాన మాడవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులను దర్శనానికి, ఆర్జిత సేవలకు అనుమతిస్తారు.

మల్లన్న సేవలో మంత్రి అప్పలరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను సోమవారం పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ అప్పలరాజు దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలునిర్వహించుకున్నారు. అనంతరం వీరు అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ పెద్దిరాజు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.



మంత్రికి స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను అందజేస్తున్న చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ పెద్దిరాజు



పెట్టుబడి సాయంతో అప్పల బాధలు తీరాయి

2019 సంవత్సరానికి ముందు వ్యవసాయం చేసేందుకు విత్తనాలు, రసాయన ఎరువులు కొనుగోలుకు బ్యాంకులు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా పథకం ద్వారా విత్తనానికి ముందే పెట్టుబడి సాయం అందుతోంది. నాకున్న ఆరు ఎకరాల సొంత పొలంతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో మిరప, శనగ, జొన్న, ఆముదం, మినుము పంటలు సాగు చేస్తున్నాను. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ. 13,500 పెట్టుబడి సాయం అందుతోంది. ఇప్పటి వరకు ఐదు విడతల్లో నగదు ఖాతాలో జమ అయింది. మొత్తాన్ని ఆ ఏడాదికి సంబంధించి విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు కొనుగోలుకు వినియోగిస్తున్నాను. పెట్టుబడికోసం బ్యాంకుల చుట్టూ, ఇతర వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సిన బాధలు తీరిపోయాయి. మా కుటుంబానికి రైతు భరోసాతోపాటు వైఎస్సార్ ఆసరా, పక్కాగృహం మంజూరు కావడంతో సొంతింటి కల నెరవేరింది.

– వెంకటేశ్వర్లు, రైతు, జోళదరాశి గ్రామం, కోవెలకుంట్ల మండలం



జగనన్న పాలనలో ఎన్నో మార్పులు

ఇప్పుడు సర్కారు బడికి మా పిల్లలను పంపేందుకు నాకు ఎంతో ధైర్యం వచ్చింది. ఎందుకంటే నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపు రేఖలు మారాయి. ఎంతో ఆహ్లాదంగా..సుందరంగా కనిపిస్తున్నాయి. అంతేగాక మా కూతురు స్వాతి ప్రస్తుతం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ఇటీవలే సార్లోళ్లు నా బిడ్డకు ట్యాబ్‌ను కూడా ఇచ్చారు. అలాగే జగనన్న విద్యాకానుక ద్వారా బ్యాగులు, నోటు పుస్తకాలు, షూ, సాక్సులు, బెల్టు, రెండు జతల యూనిఫాం ఇచ్చారు. గతంలో ఇలాంటివి మా పిల్లలకు ఎవ్వరూ ఇవ్వలేదు. జగనన్న వచ్చాక ఎన్నో మార్పులు చూస్తున్నాం. పేద విద్యార్థుల చదువుల విషయంపై జగనన్న ఎంతో శ్రద్ధ చూపుతున్నారు. బడిలో బెంచీలు, తాగునీరు, బోర్డులు, వంటివి చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది. ముఖ్యంగా మాకు అమ్మఒడి పథకం వర్తిస్తుంది.

– మహాలక్ష్మి, దొర్నిపాడు




బిషప్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ చౌరప్ప


ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న బ్రాహ్మణకొట్కూర్ గ్రామస్తులు


డోన్ బైబిల్ మిషన్ చర్చిలో చీరెలు పంపిణీ చేస్తున్న రెవ.బందెల రాజు


మద్దికెరలో పూలతో బాలయేసును అలంకరించిన దృశ్యం


దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో చిన్నారులకు క్రిస్మస్ కానుకలను అందజేస్తున్న యువకులు


కర్నూలు: సీక్యాంపు ప్రార్థన మందిరంలో ప్రేయర్ చేస్తున్న రెవరెండ్ గంట కరుణ సాగర్


కర్నూలు: క్రైస్తవులను ఆశీర్వదిస్తున్న రెవరెండ్ డాక్టర్ వరప్రసాదు


ప్రభువా: ప్రార్థన చేస్తున్న యువతి


సీఎస్ఐ చర్చిలో పండుగ వాతావరణం

శాంతి.. కరుణ.. ప్రేమ

హ్యాపీ హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ మెర్రీ క్రిస్మస్ అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు సంబరాలు చేసుకున్నారు. బాల ఏసు రాకను స్వాగతిస్తూ ఆదివారం అర్ధ రాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలు ప్రారంభయ్యాయి. కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఊరూరా బాల ఏసు ప్రతిమను ఊరేగిస్తూ గేయాలు ఆలపించారు. సోమవారం ఉదయాన్నే చర్చీలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పాస్టర్లు వ్యాఖ్యోపదేశం చేశారు. పాపుల రక్షణకు ఏసు భూలోకానికి వచ్చారని, ప్రతి ఒక్కరూ ఏసు చూసిన శాంతి మార్గంలో నడుస్తూ కరుణ చూపుతూ సహోదర ప్రేమను కురిపించాలని సూచించారు. గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


కర్నూలు: బిషప్ చర్చిలో ఏసు జనన వృత్తాంతం


నందికొట్కూర్: సీఎస్ఐ టౌన్ చర్చి చుట్టూ సిలువతో తిరుగుతున్న క్రైస్తవ భక్తులు


ఉయ్యాలవాడ హోసన్న మందిరంలో నృత్యం చేస్తున్న చిన్నారులు


కర్నూలు: కోల్స్ చర్చిలో ప్రార్థన చేయిస్తున్న రెవరెండ్ జీవన్‌రావు


వెల్దుర్తి హోసన్న మందిరంలో ప్రబోధిస్తున్న రెవరెండ్ ఇసాక్


కర్నూలు: బైబిల్ చదువుతున్న మహిళలు


హాజరైన క్రైస్తవులు


ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు


వెల్దుర్తి ఏబీఎం మెయిన్ చర్చిలో పాల్గొన్న క్రైస్తవులు

సివిల్ ఇంజినీరు ఆత్మహత్య

కర్నూలు(అర్బన్): నగర శివారులోని కర్నూలు–దూపాడు రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై సివిల్ ఇంజినీరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. డోన్ పట్టణం తారకరామానగర్‌కు చెందిన కొమ్ము మనోహర్ (27) కర్నూలు – గుంటూరు జాతీయ రహదారి పనులకు సంబంధించిన సంస్థలో సివిల్ ఇంజినీరుగా పని చేస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం రైలు పట్టాలపై మృతదేహం రెండు భాగాలుగా పడి ఉండటాన్ని రైల్వే గ్యాంగ్‌మెన్ వెంకటేశ్వర్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి ఆత్మహత్యగా కేసు నమోదు చేసుకున్నామని, ఆత్మహత్యకు కారణాలు విచారణలో తెలియాల్సి ఉందని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కోదండ రాముడు తెలిపారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం


హేమంత్ (ఫైల్)

ఓర్వకల్లు: చదువుపై ఇష్టం లేక ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపాయాడు. ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని కొమరోలు గ్రామానికి చెందిన బోయ శివ, మహేశ్వరి దంపతుల కుమారుడు హేమంత్ (14) మీదివేముల జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. చదువుపై ఇష్టం లేదని, ఏదైనా పని చేసుకుంటానని తల్లిదండ్రులతో చెప్పేవాడు. ఇదే విషయమై ఇటీవల మందలించారు. దీంతో మనస్థాపానికి గురై ఈనెల 20న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పారిన ముందస్తు ప్రణాళిక

- ఎల్ఎల్‌సీ నీటితో వెసులుబాటు
- రెండు నెలల కిందటే ఎస్ఎస్ ట్యాంకులు నింపుకునేందుకు చర్యలు
- 5.9 టీఎంసీల వాటా నీటితో నిండిన జలాశయాలు
- 17 ఎస్ఎస్ ట్యాంకుల్లో సమృద్ధిగా నీరు
- తొలగిన 372 జనావాసాల నీటి కష్టాలు



కర్నూలు(అర్బన్): అధికార యంత్రాంగం ముందస్తు చర్యలతో జిల్లాలోని 372 జనావాసాల నీటి కష్టాలు తప్పాయి. తాగునీటికి ప్రధాన వనరు తుంగభద్ర దిగువ కాలువ నీటిని సకాలంలో వినియోగించుకోవడం వల్ల మరో రెండు నెలల వరకు తాగునీటికి ఢోకా లేదు. నవంబర్ నెలాఖరు నాటికి తుంగభద్ర దిగువ కాలువకు నీటి సరఫరా బంద్ కానుందని, ఈలోపు దిగువ కాలువ నీటిపై ఆధారపడిన ఎస్ఎస్ ట్యాంకులన్ని నింపుకోవాలని జలవనరుల శాఖ ఇంజినీర్లు అక్టోబర్‌లో సూచించారు. డిసెంబర్‌తో పాటు 2024 జనవరి, ఫిబ్రవరి నెలలను దృష్టిలో ఉంచుకొని ఆయా ఎస్ఎస్ ట్యాంకులను నింపుకునేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు చర్యలు చేపట్టారు. పశ్చిమ ప్రాంతాలు ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లోని 4,87,932 జనాభాకు తుంగభద్ర దిగువ కాలువ నీరే ఆధారం. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం వల్ల ఆయా ప్రాంతాల ప్రజలకు నీటిని సరఫరా చేసే జలాశయాల్లో నీరు సగానికి తగ్గిపోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కొంత ఆందోళనకు గురయ్యారు.

ఎల్ఎల్‌సీ నీటితో వెసులుబాటు

ఎల్ఎల్‌సీ నీటిని నిల్వ చేసుకునేందుకు వెసులుబాటు లభించడంతో ఆయా ప్రాంతాల్లోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను తుంగభద్ర దిగువ కాలువ నీటితో నింపి దాదాపు 372 గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. టీబీ డ్యాం నుంచి జిల్లాకు (ఎల్ఎల్‌సీకి) 11.9 టీఎంసీలు కేటాయింపులు కాగా, ఇప్పటి వరకు 6 టీఎంసీలకు ఉపయోగించుకోగా, ఇంకా 5.9 టీఎంసీల నీటిని వినియోగించుకోవాల్సి ఉన్నట్లు జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని ఎస్ఎస్ ట్యాంకులతో పాటు కేసీ కెనాల్ పరిధిలోని గార్గేయపురం, గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలోని పత్తికొండ స్కీం నుంచి ఆయా గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆయా జలశయాల్లో ఎల్ఎల్‌సీ, హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని నిల్వ చేశారు. ఎల్ఎల్‌సీ, కేసీ, జీడీపీ కెనాల్స్ నుంచి ఎస్ఎస్ ట్యాంకులకు రెగ్యులర్‌గా నీటిని పంప్ చేస్తూనే ఆయా గ్రామాల ప్రజల అవసరాలకు నీటిని విడుదల చేస్తూ వచ్చారు. దీంతో జిల్లాలోని అన్ని జలాశయాలు నేడు 90 నుంచి 100 శాతం నీటితో కళకళలాడుతున్నాయి.

జిల్లాలో ఎస్ఎస్ ట్యాంకుల్లో నీటి నిల్వలు

మొత్తం 17 జలాశయాలకు సంబంధించి ఇప్పటి వరకు పెసలబండ, మండగిరి, హెబ్బటం, హోనవాలు, కుప్పగల్, కొతాళం, గోనెగండ్ల, ఎల్లార్తి, బాపురం, చింతకుంట, విరుపాపురం సమగ్ర రక్షిత మంచినీటి పథకాల్లో వంద శాతం నీరు పుష్కలంగా ఉంది. మిగిలిన వాటిలో 70 నుంచి 90 శాతం నీరు నిల్వ ఉంది.

జనవరిలో కూడా ఎల్ఎల్‌సీకి నీరు వచ్చే అవకాశం



తుంగభద్ర దిగువ కాలువకు జనవరి నెలలో కూడా మరోసారి నీటిని వదిలే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఎల్ఎల్‌సీకి నీరు బంద్ అయినా ఎలాంటి ఇబ్బంది లేకుండా దిగువ కాలువ పరిధిలోని ఎస్ఎస్ ట్యాంకుల్లో అవసరాల మేర నీటిని నిల్వ చేశాం. అధిక భాగం ఎస్ఎస్ ట్యాంకులన్నీ ఎల్ఎల్‌సీ పరిధిలోనే ఉన్నాయి. ఆయా జలాశయాలతో పాటు హెచ్ఎన్ఎస్ఎస్ నీటితో గార్గేయపురం జలాశయాన్ని కూడా నింపుతున్నాం. ఇప్పటి వరకు 70 శాతం నీరు నిల్వ ఉంది. ఇంకా ఫిల్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. జనవరిలో ఎల్ఎల్‌సీకి నీటిని విడుదల చేస్తే రానున్న వేసవిలో ఎలాంటి నీటి ఇబ్బందులు ఉండవు.

– బీ నాగేశ్వరరావు, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

చదువుతోనే జాతి అభివృద్ధి సాధ్యం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బలిజ, కాపు సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): చదువుతోనే జాతి అభివృద్ధి సాధ్యమని, బలిజలు తమ పిల్లలను బాగా చదివించి వారికి నచ్చిన రంగంలో రాణించేలా ప్రోత్సహించాలని అహోబిలం నిత్యాన్నదాన సత్రం అధ్యక్షులు శెట్టి విజయకుమార్ సూచించారు. సోమవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కార్యాలయంలో దివంగత మిరియాల వెంకటరావు జయంతి, వంగవీటి మోహనరంగా వర్ధంతిల సందర్భంగా బలిజ, కాపు సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షులు కోనేటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విజయకుమార్ మాట్లాడుతూ దివంగత బలిజ, కాపు నేతల స్ఫూర్తితో బలిజ యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. రోపా ఆధ్వర్యంలో ఏటా బలిజ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో బలిజల జనాభా దామాషా ప్రకారం చట్టసభలకు సీట్లు కేటాయించాలన్నారు. అనంతరం కాపు సంక్షేమ సేన ఉమ్మడి కర్నూలు జిల్లా 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బలిజ సంఘం కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు కోనేటి చంద్రబాబు, దంతెల రమణ, కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు ఆర్జా రామక్రిష్ణ, రోపా అధ్యక్షులు కొట్టే చెన్నయ్య, మహిళా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల హేమలత తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


దేవస్థానం టోల్ గేట్ సమీపంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు

శ్రీశైలం: శ్రీశైలంలో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుండటంతో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు నేరుగా రంగంలోకి దిగారు. సమస్యను తెలుసుకున్న ఆయన ఆదివారం అర్ధరాత్రి 1 గంటకు శ్రీశైలం చేరుకుని సిబ్బందితో కలిసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. టోల్‌గేట్, నందిమండపం, ఔటర్‌రింగ్ రోడ్డు, సాక్షిగణపతి, హఠకేశ్వరం తదితర తదితర ప్రదేశాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా విడుతల వారీగా వాహనాలను శ్రీశైలానికి తిరిగి వెళ్లేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ రద్దీ సమయాల్లో స్థానిక పోలీసులతో పాటు దేవస్థానం సెక్యూరిటీ సిబ్బందికి అదనంగా మరో 50 మంది హోమ్‌గార్డులను దేవస్థానం వారు నియమించుకునేలా ఈఓకు సూచించామన్నారు. అలాగే అదనపు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసి అక్కడ టాయిలెట్స్, మంచినీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పించాలని ఈఓ, చైర్మన్‌కు రాతపూర్వకంగా ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

హాస్టళ్లకు దుప్పట్లు మంజూరు


విద్యార్థులకు దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వసతి గృహాల విద్యార్థులకు ప్రభుత్వం దుప్పట్లను సరఫరా చేసింది. సోమవారం సాయంత్రం వాటిని స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ, డీఎన్‌టీ బాలుర వసతి గృహాల విద్యార్థులకు బీసీ సంక్షేమ, సాధికారత జిల్లా అధికారిణి పి.వెంకటలక్షుమ్మ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాకు 5,200 దుప్ప ట్లు మంజూరయ్యాయని, వాటిని అన్ని వసతి గృహాలకు పంపే ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీబీసీడబ్ల్యూఈఓ భరత్‌కుమార్‌రెడ్డి, సహా య బీసీ సంక్షేమశాఖ అధికారి లక్ష్మినారాయణ, వసతి గృహ సంక్షేమాధికారిణి మహాలక్ష్మి పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

- ఇద్దరికి గాయాలు


మృతిచెందిన అయ్యస్వామి

మిడుతూరు: వీపనగండ్ల బాట సమీపంలో ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మిడుతూరుకు చెందిన లక్ష్మీకి బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామానికి చెందిన అయ్యస్వామి (25)తో మూడేళ్ల క్రితం వివాహమైంది. క్రిస్మస్ సందర్భంగా ముద్దవరం నుంచి దంపతులిద్దరూ మిడుతూరుకు చేరుకున్నారు. కాగా ఆదివారం ఉదయం వడ్డెమానులో ఉన్న బంధువుల ఇంటికి అయ్యస్వామి బైక్‌పై వెళ్తుండగా వీపనగండ్ల బాట సమీపంలో అలంపూరుకు చెందిన మహిధర్, కుమార్ మిడుతూరులో ఉన్న బంధువుల ఇంటికి బైక్‌పై వస్తూ ఎదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అయ్యస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ఇద్దరిని 108లో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ జగన్ మోహన్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, మూడు నెలల కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


క్షతగాత్రులను 108లో తరలిస్తున్న దృశ్యం